ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం



భగాయత్‌లో సమస్యలను పరిష్కరించాలి

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, స్థానికులు అవస్థలు పడుతున్నారని, అయినా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్య, దొంగలు, తాగుబోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినతి పత్రంలో వారు తెలిపారు. లే అవుట్‌లో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయిందని, శానిటేషన్ సిబ్బంది కనిపించడం లేదని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి త్వరలో అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేకల మధుసూదన్‌రెడ్డి, గోనే అర్జునరెడ్డి, చింతల నర్సింహారెడ్డి, పిల్లి నాగరాజు, కృష్ణమాచారి, బంగ్లా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చెట్టు కొమ్మలు తొలగించండి



రామంతాపూర్: పరిధిలోని శ్రీనివాసపురం రోడ్ నంబర్–3 లేన్ ఇంటి నంబర్ 3, 4, 21/8 ఇంటి ముందు రోడ్డు పక్కన ఉన్న భారీగా పెరిగిన చెట్టు కొమ్మలు పెద్ద సంఖ్యలో అన్ని వైపులా వ్యాపించాయి. ఈదురు గాలులకు ఈ కొమ్మలు విద్యుత్ వైర్లపై పడే అవకాశం ఉంది. వెంటనే ఈ చెట్టు కొమ్మలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక సీనియర్ సిటిజన్ సంఘం ఉపాధ్యక్షుడు కేదారేశ్వర రావు కోరారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ విద్యుత్ అధికారులకు చెప్పినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఆంజనేయులు,
జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్
ఫోన్ నంబర్: 91547 96619.

మల్లికార్జుననగర్ కాలనీలో కలుషిత నీరు



తాగునీరేనా.. గరళమా..?

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీలో బుధవారం కలుషిత నీరు సరఫరా అయ్యింది. దీంతో కాలనీవాసులు నీటిని చూసి అవాక్కయ్యారు. చాలారోజుల నుంచి తాగునీటిలో మురుగు కలిసి కలుషిత నీరు సరఫరా అవుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటిని తాగితే రోగాలు తప్పవని, ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించాలని కోరుతున్నారు. పైప్‌లైన్లను పరిశీలించి నీరు కలుషితం కాకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసి ఈరన్నగారి వెంకటేష్ కోరుతున్నారు.

రోడ్లన్నీ గుంతలమయం.. స్పందించరేం..?



రామంతాపూర్: వెంకటరెడ్డినగర్ ఇందిరానగర్ డీమార్ట్, నెహ్రూనగర్, భరత్‌నగర్, టీవీ కాలనీ తదితర కాలనీలో రోడ్లన్నీ గుంతలుగా మారి అధ్వాన్నంగా మారిపోయాయి. అభివృద్ధి పనుల కోసం రోడ్లను తవ్వడంతో పాటు ఈ రోడ్డు చాలా సంవత్సరాల క్రితం వేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు చొరవ చూపి కనీసం రోడ్లపై పడిన గుంతల్లో ప్యాచ్‌లు వేసి గుంతలను పూడ్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి... ఉప్పల్ జీహెచ్‌ఎంసీ ఈఈ నాగేందర్
ఫోన్ నంబర్: 99899 30401

మరకత శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో పూజలు



అల్వాల్: అల్వాల్ మరకత శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం శ్రీలక్ష్మీ గణపతి స్వామికి ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు, కార్యనిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి మాట్లాడుతూ.. భక్తుల సర్వాభీష్టాలను నెరవేరుస్తున్న స్వామి దర్శనంతో సకల శుభాలు కలుగుతాయని, ఆరోగ్యం, ఐశ్వర్యం, అభివృద్ధి, కీర్తి ప్రతిష్టలు, వ్యాపార అభివృద్ధి కలుగుతుందన్నారు. ఆలయ అభివృద్ధికి భూస్థల సేకరణ కొనసాగుతోందని, దానికి భక్తుల సహకారం అవసరం అన్నారు. అన్న ప్రసాద వితరణకు విరాళాలు అందజేసేందుకు అన్న ప్రసాద ట్రస్టును సంప్రదించాలని కోరారు.

కార్పొరేషన్ చైర్మన్ పదవి గురించి సీఎంతో చర్చించాలి



పరమేశ్వర్‌రెడ్డిని కలిసిన కురుమ సంఘం

మల్లాపూర్: గొర్రెల, మేకల కార్పొరేషన్ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్, కురుమ సంఘం నాయకులు చౌదరిపల్లి పర్వతాలుకు ఇవ్వాలని కోరుతూ బుధవారం కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డిని కురుమ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ పదవి కురుమలకు వచ్చేలా మాట్లాడాలని కోరారు. పరమేశ్వర్‌రెడ్డిని కలిసిన వారిలో జిన్ని రఘు కురుమ, రెగు కృష్ణయ్య కురుమ, గొరిగే బాలయ్య, కర్రె శ్రీనివాస్‌కురుమ, సోము బాలమణి తదితరులు ఉన్నారు.

పరామర్శ



జ్యోతిని పరామర్శిస్తున్న చేతన, శిల్పారెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్‌కి చెందిన మహిళా మోర్చా సభ్యురాలు జ్యోతి ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో యాక్సిడెంట్ కావడంతో కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ ఆమెకు సర్జరీ చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి బుధవారం జ్యోతి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. కార్యక్రమంలో మహిళ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ అనితపద్మారెడ్డి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ పద్మ, హబ్సిగూడ డివిజన్ అధ్యక్షురాలు రాగి లతారెడ్డి, మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన




అల్వాల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం అల్వాల్ ఇందిరానగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి స్థానికులు హాజరై బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, అల్వాల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సౌందరేసన్, సెక్రటరీ సుదర్శన్‌రావు, కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

‘విత్తనాల సరఫరాలో సర్కారు విఫలం’

ఘట్‌కేసర్: రైతులకు వానాకాలం పంటలకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, విత్తనాల కోసం లైన్‌లో నిలబడిన రైతులపై లాఠీ చార్జ్ చేయడం సిగ్గేచేటని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన దిగుబడులు కొనుగోలు చేయకుండా ధాన్యం దళారుల పాలు చేయడానికి మిల్లర్లతో కుమ్మక్కయ్యారని విమర్శించారు.

మెరుగైన వైద్యం అందించాలి: ఎంపీపీ



ఘట్‌కేసర్: వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం అవుషాపూర్ పల్లె దవాఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు, ఆశ వర్కర్ల పనితీరు, ఆస్పత్రిలో సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సమస్యలుంటే తెలపాలన్నారు. గతంలో విద్యుత్ సమస్యను పరిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు.

కేంద్రంలో వచ్చేది మోదీ ప్రభుత్వమే..

మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: కేంద్రంలో త్వరలో ఏర్పడబోయేది మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. హబ్సిగూడలోని ఆయన నివాసంలో బుధవారం ఉప్పల్ నియోజకవర్గంలోని బీజేపీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షకార్యదర్శులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సైతం మోదీ ఆధ్వర్యంలో 10 నుంచి 12 సీట్లను గెలవబోతున్నామన్నారు. బీజేపీలో కష్టపడి పనిచేసిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని అన్నారు. 13న జరిగిన ఎన్నికల సరళిని ఆయన పార్టీ ముఖ్యులతో బూతుల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కక్కిరేని చేతనహరీష్, బండారు శ్రీవాణి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, పద్మారెడ్డి, సాయి, డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో హంగర్ ఫ్రీ వరల్డ్



హంగర్ ఫ్రీ వరల్డ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ సంపత్ తదితరులు

హబ్సిగూడ: ఆకలి రహిత ప్రపంచం సాధన దిశగా మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో వరల్డ్ హంగర్ డే సందర్భంగా బుధవారం హబ్సిగూడలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్ వద్ద హంగర్ ఫ్రీ వరల్డ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏసీపీ సంపత్‌కుమార్, స్టోర్ హెడ్ మహ్మద్ అహ్మద్ సోఫీలు హాజరై కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అహ్మద్ సోఫీ మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎన్‌జీవో థనల్–దయా రిహాబిలిషేన్ ట్రస్ట్ సహాయంతో మలబార్ గ్రూప్, థనల్ వాలంటీర్లు వీధులు, పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలను గుర్తించి ఆహార ప్యాకెట్లను వారి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్నారన్నారు. కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ నిరుపేదలకు పుష్టికరమైన ఆహారాన్ని అందిస్తున్నామని, ఇకపై ఈ కార్యక్రమం మరింత మంది ప్రజలకు, నగరాలకు విస్తరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, హబ్సిగూడ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఎదుటే.. అల్లరి మూకల వీరంగం

- కర్రలు, రాళ్లతో కొట్టుకున్న గ్రూపులు
- కేసు నమోదు చేసిన పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంతోష్

ఉప్పల్: ఉప్పల్‌లో అల్లరి మూకలు వీరంగం సృష్టించారు. పోలీసులు ఎదుటే గ్రూపులుగా ఏర్పడి కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. ఈ సంఘటన ఉప్పల్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం ఉప్పల్‌కు చెందిన ఈగ అభినయ్ శాంతినగర్ ఉప్పల్ భగాయత్ వద్ద క్రికెట్ ఆడుకుంటుండగా స్థానికంగా ఉన్న ధనుంజయ్ వారిని అడ్డుకోవడంతో మాటామాటా పెరిగింది. దీంతో ధనుంజయ్ అభినయ్‌ను బ్యాట్‌తో చితకబాదాడు. ఇదే విషయాన్ని అభినయ్ తండ్రి ఈగ సంతోష్‌కు తెలపడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం ధనుంజయ్‌ను తీసుకురావడానికి పోలీసులు వెళ్లగా వెంటనే ఈగ సంతోష్ తన అనుచరులతో కలిసి అక్కడకు చేరుకున్నాడు. అప్పటికే ధనుంజయ్‌తో పాటు లఖన్ అనే వ్యక్తి మరికొంత మంది ఉన్నారు. తిరిగి వీరిద్దరు పోలీసుల ఎదుటే వాగ్వాదానికి దిగడంతో పాటు అక్కడే ఉన్న బ్యాట్‌లు, రాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ఆ ప్రాంతం పూర్తిగా రణరంగంగా మారింది. రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితులను చక్కదిద్ది ఇరువురిని చెదరగొట్టారు. ఈ సంఘటనలో గాయపడిన ఈగ సంతోష్, అతడి కుమారుడు అభినయ్‌తో పాటు మరో ఏడుగురు వ్యక్తులను ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన మరోవర్గం వారిని కూడా ఆస్పత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సీఐ ఎలక్షన్‌రెడ్డి చెప్పారు.

క్రీడల్లో రాణించేలా శిక్షణ పొందాలి



అథ్లెటిక్ పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

బోడుప్పల్: చిన్నతనం నుంచి విద్యార్థులు క్రీడల్లో రాణించే విధంగా ప్రత్యేక శిక్షణ పొందాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు బుధవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్ టోర్నమెంట్‌లో పాల్గొని మెడల్స్ సాధించారు. వారిని ఆయన అభినందించి మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్–12 కేటగిరిలో సాయి మహిత్ లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, అండర్–10 కేటగిరిలో ఎ.సుశ్రుత్ లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, అండర్–8 ఇయర్స్ కేటగిరిలో బ్రాడ్ జంపింగ్ 50 మీటర్ల రేసింగ్‌లో ఎస్ వర్షిత్ 2వ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని, ప్రభుత్వం కూడా అన్ని రకాల క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమా, కోచ్‌లు సి.సురేందర్ బాబు, కె.మహేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ అరికట్టాలి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తదితరులు

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలను అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు చిన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజులు పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్య పేదలకు అందని ద్రాక్షగా మారిందని, ఫీజులు, పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డ్రెస్‌ల పేరిట లక్షలాది రూపాయలను వసూలు చేస్తూ పేదల రక్తాన్ని పీలుస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి కార్పొరేటర్ విద్యా సంస్థలకు అధికారులు వత్తాసు పలుకుతూ ప్రోత్సహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క పాఠశాల అనుమతి పేరుతో పదుల సంఖ్యలో స్కూల్స్ నడుపుతూ అమాయక తల్లిదండ్రులను నిలువునా ముంచుతున్నారన్నారు. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినా విద్యాశాఖ అధికారుల ప్రోత్సాహంతోనే యథేచ్ఛగా పాఠశాలలను నడపడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం, అధికారులు ఫీజులను అరికట్టలేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, సభ్యులు అరవింద్, సాయి, నరేష్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ పాత్రల్లో వంట చేస్తే మరింత రుచి



సాక్షి, సిటీబ్యూరో: సంప్రదాయ పాత్రల్లో వండడం ద్వారా తెలంగాణ వంటకాలు మరింత మేలైన రుచిని సంతరించుకుంటాయని పాకశాస్త్ర నిపుణులు అన్నారు. సంప్రదాయ వంట పాత్రలపై కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ రాతి చిప్ప లేదా కల్ చట్టి అనే పేరున్న రాతి పాత్రలో సన్నటి మంటపై వండితే రుచి బాగుంటుందనీ, పప్పులు, సాంబార్‌కు అనువైందన్నారు. చేతితో చెక్కిన ఈ పాత్రల్ని ఆహార నిల్వకి కూడా ఉపయోగిస్తారన్నారు. అలాగే ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయలు టమోటాలతో వండిన రుచికరమైన బెండకాయ వేపుడు(వేయించిన ఓక్రా)తో సహా పలు వంటకాలకు గుండ్రని వంట పాత్ర ఉరులి కొత్త రుచులను అద్దుతుందన్నారు. అదేవిధంగా మురుకులు/జంతికలు కోసం మురుక్కు అచ్చు, చట్నీల గ్రైండింగ్ కోసం అట్టుకల్, కోడి కూరకు మట్టి పత్ర.. తదితర పాత్రల వినియోగం అదనపు రుచి, ఆరోగ్య లాభాలు అందిస్తాయన్నారు. ఈ సందర్భంగా గోల్డ్ డ్రాప్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా మాట్లాడుతూ, ‘మట్టి కుండల నుంచీ ఇనుప పాత్రల వరకు సాంప్రదాయ వంట పాత్రలు వినియోగిస్తే ప్రతి వంటకానికీ అవి కొత్త ప్రమాణాలను జోడిస్తాయి’ అని అభిప్రాయపడ్డారు.

ఉంటాయా.. పోతాయా..



- మేడ్చల్ జిల్లాలో స్థానిక సంస్థల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- జిల్లాలోని 80 శాతం భాగం హైదరాబాద్ నగరంలోనే..
- సిటీలోనే మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు

మేడ్చల్: నగరానికి ఆనుకున్న మేడ్చల్ జిల్లాలోని స్థానిక సంస్థల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. హైదరాబాద్ మహానగరాన్ని చుట్టుపక్కల గ్రామాలు, మున్సిపాలిటీలతో కలిపి మరింత విస్తరించి దేశంలోనే ఢిల్లీ, ముంబై నగరాల మాదిరిగా మరింత గ్రేటర్ సిటీగా మార్చే యోచనలో రేవంత్ రెడ్డి సర్కార్ ఉండటమే దీనికి కారణం. జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. ఉప్పల్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి నియోజకవర్గాలు పూర్తిగా జీహెచ్‌ఎంసీ పాలన పరిధిలో ఉండగా కుత్బుల్లాపూర్ సగం జీహెచ్‌ఎంసీ పరిధిలో, సగం స్థానిక సంస్థల పరిపాలనలో ఉంది. మేడ్చల్ నియోజకవర్గం మొత్తంగా స్థానిక సంస్థల పరిధిలో ఉంది. మేడ్చల్, కుత్బుల్లాపూర్ స్థానిక సంస్థల పరిధిలో ఉన్న నియోజకవర్గాలోని సగం ప్రాంతాలు హైదరాబాద్ నగరంతో కలిసే ఉన్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలో మండలాలు గ్రామీణ వాతావరణంలో ఉన్న మిగతా ప్రాంతమంతా పట్టణ ప్రాంతంగా ఉండటంతో జీహెచ్‌ఎంసీకి చేరువగా ఉన్నాయి.

గ్రామాలు, మున్సిపాలిటీలు ప్రశ్నార్థకం

జిల్లాలో మేడ్చల్ నియోజకవర్గంలో 61 గ్రామ పంచాయతీలు, జవహర్‌నగర్, ఫీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లు, మేడ్చల్, తూంకుంట, దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్, పోచారం, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. మేడ్చల్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలు మినహా మిగతా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు అన్నీ ఔటర్‌రింగు రోడ్డు లోపలి భాగంలో ఉన్నాయి. ప్రభుత్వం హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఓఆర్‌ఆర్ వరకు జీహెచ్‌ఎంసీ పరిధిని విస్తరించాలని ఆలోచనలో ఉండటంతో స్థానిక సంస్థలు ఉంటాయా.. పోతాయా.. అనే చర్చ జిల్లాలో జోరుగా సాగుతున్నాయి.

ఐదుగురికి జిల్లా పరిషత్...

మేడ్చల్, ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలాలతో ఐదు జెడ్పీటీసీలతో జిల్లా పరిషత్ ఏర్పడింది. దీంతో జిల్లా పరిషత్ ప్రభావం పెద్దగా లేకుండా పోయింది. జిల్లా పరిషత్ జిల్లాలో నామమాత్రంగా మారిపోయింది. పేరుకు పెద్ద జిల్లా అయినా కేవలం ఐదుగురు జెడ్పీటీసీలతో అందులో ఒకరు చైర్మన్, మరొకరు వైస్ చైర్మన్ పోగా కేవలం ముగ్గురు సభ్యులతో నామమాత్రంగా మారిపోయింది. గతంలో 20 నుంచి 25 మంది వరకు ఎంపీటీసీ సభ్యులతో మండల పరిషత్ ఉండేది. తాజాగా 10 మందితో మండల పరిషత్ నడుస్తుంది. నామమాత్రంగా మారి రాజకీయ పార్టీల నాయకుల నిరుద్యోగ సమస్యను తీర్చే ఉద్యోగ వనరులుగా మారాయి.

చిన్న గ్రామాలుగా గ్రామ పంచాయతీలు

గ్రామ పంచాయతీల పునర్విభజన చేయడంతో కేవలం 500 నుంచి 800 జనాభా ఉన్న గ్రామాలు గ్రామపంచాయతీలుగా మారాయి. ఇతర ఆదాయాలు శూన్యంగా ఉన్నా పేరుకు గ్రామపంచాయతీలుగా ఉన్నా అభివృద్ధి ఆమడ దూరంలో నడుస్తున్నాయి. జిల్లాలో మేడ్చల్ నియోజకవర్గంలో మాత్రమే 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

గతంలో మాదిరిగానే...

20 ఏళ్ల క్రితం ప్రస్తుతం మేడ్చల్ జిల్లాగా ఉన్నా నియోజకవర్గాలు మున్సిపాలిటీలుగా ఉండేవి. ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కాప్రా నగర శివార్లలో మున్సిపాలిటీలుగా ఉండేవి. నగరం పెరగడంతో వాటిని నాటి ప్రభుత్వాలు జీహెచ్‌ఎంసీలో విలీనం చేశాయి. తాజాగా నగరం శరవేగంగా విస్తీర్ణం చెంది, మేడ్చల్ జిల్లా వైపు కాంక్రీట్ జంగిల్‌గా మారింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు నగర వాతావరణంలో ఉండి నగరంలోనే మిళితమై కనిపిస్తున్నాయి.

మున్సిపాలిటీలుగా గ్రామాలు

కేవలం జిల్లాలో రెవెన్యూ మండలాలు ఉంచి మిగతా మండల పరిషత్, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలను పూర్తిగా రద్దు చేసి మున్సిపాలిటీలను మార్చే యోచనలో ప్రభుత్వం ఉందని అన్ని రాజకీయ పార్టీల నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న మున్సిపాలిటీలకు సమీపంగా ఉన్న గ్రామాలను వాటిలో విలీనం చేసి జీహెచ్‌ఎంసీలో కలపడం, ఔటర్‌కు దూరంగా ఉన్న గ్రామాలను పెద్ద గ్రామంలో కలిపి ప్రత్యేక మున్సిపాలిటీని ఏర్పాటు చేసి పాలన సాగించడం వంటి సాధ్యాసాధ్యాలపై అధికారులు అంతర్గతంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవలం జిల్లాలో రెండు, మూడు మున్సిపాలిటీలు ఉంచి మిగతా ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసి హైదరాబాద్ మహానగరాన్ని విస్తరించే యోచనలో ప్రభుత్వ పెద్దలు కనిపిస్తుండటంతో రాబోయే స్థానిక సంస్థల పోరు మేడ్చల్ జిల్లాలో ఉంటుందో, పోతుందో అనే చర్చలు మేడ్చల్‌లో జోరుగా సాగుతున్నాయి. ఇప్పటివరకు మేడ్చల్ జిల్లా హైదరాబాద్ నగరంలో అంతర్భాగం ఉన్నా రాబోయే రోజుల్లో జిల్లా హైదరాబాద్‌లో విలీనం కావడం అనివార్యంగా కనిపిస్తుంది.

క్రిమినల్ చట్టాలపై పోలీసులకు అవగాహన



మేడ్చల్ రూరల్: నూతన క్రిమినల్ చట్టాలపై మేడ్చల్ పోలీసులకు అధికారులు అవగాహన కలిపించారు. ఈమేరకు ధ్రువ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. మేడ్చల్ డివిజన్ పరిధిలోని మేడ్చల్, సురారం, దుండిగల్, పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. చట్టంలో చేసిన మార్పులు, కొత్త చట్టాలు వంటి అంశాలను వివరించారు. సమావేశంలో మేడ్చల్ అడిషనల్ డీసీపీ నర్సింహ్మారెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారయణ, ఎస్‌ఐ మురళీధర్ మూడు పీఎస్‌ల సీఐలు, ఎస్‌ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యంనంపేట్‌లో ఖాళీ జాగాపై వివాదం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఖాళీ జాగాపై వివాదం ఏర్పడింది. ప్రైవేటు వ్యక్తులు తమదని ఒకవైపు వాదిస్తుంటే.. మరోవైపు పోచారం మున్సిపాలిటీకే చెందుతుందని అధికారులు చెబుతున్నారు. యంనంపేట్‌లోని సర్వే నంబర్ 137, 138లో ఉన్న 29.34 ఎకరాల్లో 1979వ సంవత్సరంలోనే వెంకటేశ్వరనగర్ పేరుతో లేఔట్ చేశారు. ఇందులోని 8 వేల చదరపు గజాల ఖాళీ జాగాలో మూడేళ్ల కింద మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంతో రూ. 8 లక్షలు వెచ్చించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి చెత్త డంపింగ్ చేస్తున్నారు. కానీ, ఈ స్థలం తనదేనని పోలగోని రాజేందర్‌గౌడ్ మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తన వద్ద ఉన్న డాక్యుమెంట్లను అందజేశారు. ఖాళీగా ఉన్న ఆ జాగాను తాత్కాలికంగా డంపింగ్ కోసం వాడుకుంటున్నామని, త్వరలోనే తీసేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఇటీవల ఈ డంపింగ్ యార్డులో మరిన్ని నిర్మాణాలు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయడంతో రాజేందర్‌గౌడ్ అప్రమత్తమయ్యారు. డంపింగ్ యార్డులోకి చెత్త వాహనాలు రాకుండా అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి డంపింగ్ యార్డును ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు తరలిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. ఇటీవల కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు సదరు వివాదాస్పదస్థలంలో చెత్తను డంప్ చేయడం లేదు. ఈ క్రమంలో ఈ నెల 24న వివాదాస్పదస్థలంలో మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను రాజేందర్‌గౌడ్ తొలగించి ఈ స్థలం తనదేనని తెలియజేస్తూ ఫోన్ నంబర్లతోసహా బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో ఫెన్సింగ్ తొలగించినవారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోచారం పోలీస్‌స్టేషన్‌లో కమిషనర్ వేమన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.